సాక్షి నల్లగొండ

మంగళవారం । 12 । ఆగస్టు । 2025



ఆశయం లేనివాడే పేదవాడు

జీవితంలో ఆశయం లేనివాడే పేదవాడు అని రామకృష్ణ మఠం అధ్యక్షుడు బోధమయానందజీ మహరాజ్ అన్నారు. - 8లో



వృథాగా వదిలేస్తున్నారు

పాలకులు కృష్ణా జలాలను సముద్రంలోకి వృథాగా వదిలేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు

ప్రస్తుత నీటి మట్టం	:	589.30 అడుగులు
ఇన్‌ఫ్లో	:	65,800 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	75,875 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	29,907 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	7,086 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	:	5,654 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	:	1,800 క్యూసెక్కులు
వరద కాల్వకు	:	300 క్యూసెక్కులు

న్యూస్‌రీల్

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడలు ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి నాగరాజు

రామగిరి(నల్లగొండ) : క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి నాగరాజు అన్నారు. స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులకు మేకల అభినవ్ స్టేడియంలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. నిరంతరం బిజీగా ఉండే న్యాయవాదులకు క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా వివిధ క్రీడా పోటీలను నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా జడ్జి సంపూర్ణ ఆనంద్, కార్యదర్శి మంద నగేష్, కోశాధికారి బరిగల నగేష్, జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్ డేలో వినతుల స్వీకరణ



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ శరత్ చంద్ర పవార్

నల్లగొండ : జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డేలో ఎస్పీ శరత్‌చంద్రపవార్ 52 మంది బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. బాధితులతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఆయా ఫిర్యాదులకు సంబంధించి పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించారు. పోలీస్‌స్టేషన్‌కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారించి బాధితులకు చట్ట పరంగా న్యాయం జరిగే విధంగా చూడాలని పోలీసులకు సూచించారు.

అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలి



విద్యార్థిని ప్రశ్నిస్తున్న డీఈఓ భిక్షపతి

చిట్యాల : ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ బొల్లారం భిక్షపతి పేర్కొన్నారు. చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్, మండల పరిషత్ పాఠశాలలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలోని ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు, టీచర్స్ డైరీలు,, విద్యార్థుల వర్క్‌బుక్స్‌ను పరిశీలించారు. పలువురు విద్యార్థులతో ఆయన మాట్లాడి గణితం, ఆంగ్లం, తెలుగు అంశాలపై ప్రశ్నించి సమాధానాలను రాబట్టారు. విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచాలని కోరారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతీలో పాఠ్యాంశాలను బోధించాలన్నారు.

మూసీకి కొనసాగుతున్న వరద



మూసీ గేట్లు ఎత్తడంతో దిగువకు పోతున్న నీరు

కేతేపల్లి : భారీ వర్షాలకు మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద ఉధృతి కొనసాగుతోంది. దీంతో అధికారులు సోమవారం ప్రాజెక్టు మూడు క్రస్ట్‌గేట్లను పైకెత్తి దిగువకు నీటి విడుదలను కొనసాగిస్తున్నారు. సోమవారం సాయంత్రం వరకు ఎగువ నుంచి మూసీకి 4,718 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. మూడు క్రస్ట్‌గేట్ల ద్వారా 4,375 క్యూసెక్కులు, మూసీ కుడి, ఎడమ కాల్వలకు 454 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. 645 అడుగుల (4.46 టీఎంసీలు) గరిష్ట నీటిమట్టం గల మూసీ రిజర్వాయర్‌లో.. ప్రస్తుత నీటిమట్టం 643.50 అడుగుల (4.04 టీఎంసీలు) వద్ద ఉంది.

డీసీసీబీ.. నంబర్ వన్

రాష్ట్రంలోనే ఉత్తమ సహకార బ్యాంక్ అవార్డు సొంతం

- గత ఆర్థిక సంవత్సరంలో అదనంగా రూ.598.16 కోట్ల వృద్ధి
- మిగతా బ్యాంకులతో పోల్చితే రెట్టింపు లాభాలు
- మొండి బకాయిలు తగ్గుదల
- రైతులకు చేయూత అందించడంలోనూ ముందంజ



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: నల్లగొండ డీసీసీబీ రాష్ట్రంలోనే ఉత్తమ బ్యాంకుగా నిలిచింది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో రైతులకు ఆర్థికంగా చేయూతను అందించి ముందంజలో నిలువడమే కాకుండా డిపాజిట్ల పెంపుతో వ్యాపార వృద్ధిని సాధించింది. మొండిబకాయి(ఎన్‌పీఏ)లను తగ్గించుకోవడంతోపాటు రూ.42 కోట్ల లాభాలను ఆర్జించి, రైతులు, ఖాతాదారులకు ఉత్తమ సేవలు అందించినందుకు గాను నాబార్డు నల్లగొండ డీసీసీబీకి బెస్ట్ పర్ఫార్మింగ్ బ్యాంకు అవార్డును అందజేసింది.

లాభాల బాటలో నల్లగొండ బ్యాంకు

నల్లగొండ డీసీసీబీ గత ఆర్థిక సంవత్సరంలో వ్యాపారాన్ని రూ.2,342.13 కోట్ల నుంచి రూ.2,940.13 కోట్లకు పెంచింది. తద్వారా ఒక్క ఆర్థిక సంవత్సరంలోనే రూ.598.16 కోట్లు వృద్ధిని సాధించింది. రాష్ట్రంలో ఏ ఇతర డీసీసీబీలు ఇంతగా వృద్ధి రేటును సాధించలేదు. ఇక లాభాల విషయంలోనూ రూ.22 కోట్ల నుంచి రూ. 42 కోట్లకు పెంచగలిగింది. గతంలో ఎన్నడూలేని విధంగా దాదాపు రెట్టింపు లాభాలను గడించి ఉత్తమ బ్యాంకుగా నిలిచింది. గతంలో 1.85 శాతం ఉన్న మొండి బకాయి(ఎన్‌పీఏ)లను 1.38 శాతానికి తగ్గించుకొని రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది.

పంట రుణాల బడ్జెట్ పెంపు

రైతులకు పంట రుణాల విషయంలోనూ ఉత్తమ ప్రతిభను కనబరిచినట్లు నాబార్డు గుర్తించింది. గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.110 కోట్లు రైతులకు రుణాలుగా అందించి వారి సంక్షేమం, అభివృద్ధిలో మొదటి స్థానంలో నిలిచింది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో ఒక్క వానాకాలం సీజన్‌లోనే రైతులకు రూ.50 కోట్ల పంట రుణాలను ఇచ్చేలా చర్యలు చేపట్టింది. అవసరమైతే మరో రూ.50 కోట్లు రైతులకు పంట రుణాలుగా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. రైతులకు పంట రుణాల గరిష్ట పరిమితిని రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షలకు పెంచింది.

అనుబంధ రంగాలకు ప్రాధాన్యం

వ్యవసాయ అనుబంధ రంగాలైన నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ కింద రెతులకు కోళ్లు, కోళ్ల ఫారాలు, పాడి పరిశ్రమకు రుణాలు ఇస్తోంది. సొసైటీల ఆధ్వర్యంలో రైతులకు ఉపయోగపడేలా గోదాముల నిర్మాణానికి రుణాలు, సహకార సంఘాలకు నాబార్డు రీఫైనాన్స్ ద్వారా కిసాన్ డ్రోన్‌లు ఇచ్చి బలోపేతానికి కృషి చేస్తోంది. అంతేకాదు గ్రామీణ ప్రాంతాల్లో గృహ రుణాలు కూడా ఇచ్చేలా చర్యలు చేపట్టింది.

రూ.3,500 కోట్లు లక్ష్యంగా ముందుకు

ఈ ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు వ్యాపార లక్ష్యం రూ.3,500 కోట్లకు పెంచేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. తద్వారా రూ.70 కోట్ల లాభాలను సాధించేలా చర్యలు చేపడుతోంది. సహకార వ్యవస్థ నిబంధనలకు అనుగుణంగా వ్యవహరిస్తూనే మిగతా డీసీసీబీల కంటే నల్లగొండ డీసీసీబీ రైతు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలులో ముందంజలో ఉంది. దీంతో నాబార్డు ప్రతి ఏటా ఇచ్చే ఉత్తమ బ్యాంకు అవార్డుకు ఈసారి నల్లగొండ బ్యాంకును ఎంపిక చేసింది. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును బ్యాంకు చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, ఇతర డైరెక్టర్లు, అధికారులకు అందజేసింది.



అందుబాటులోకి మరిన్ని సేవలు

బ్యాంకు సేవలను రైతులకు అందుబాటులోకి తెచ్చేలా చర్యలు చేపడుతున్నాం. ఎక్కువ మంది రైతుల అభివృద్ధికి తోడ్పాటు అందించేలా చూస్తున్నాం. ఇందులో భాగంగానే గత ఆర్థిక సంవత్సరంలో ఐదు కొత్త బ్రాంచ్‌లను ఏర్పాటు చేశాం. ఈ ఆర్థిక సంవత్సరంలోనూ మరో ఆరు కొత్త బ్రాంచ్‌లను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాం. రైతులు, ఖాతాదారులకు ఉత్తమ సేవలను అందించడం ద్వారా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉండేలా పాలకవర్గం కృషి చేస్తోంది.

– కుంభం శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్

అదనపు చార్జీలపై ఆగ్రహం



నల్లగొండలో బారులుదీరిన ప్రయాణికులు

- ఆర్టీసీ సిబ్బందితో ప్రయాణికుల వాగ్వాదం

రామగిరి(నల్లగొండ) : రాఖీ పండుగ సందర్భంగా ఆర్టీసీ అదనపు బస్సులను ఏర్పాటు చేసింది. అయితే బస్సుల్లో చార్జీలను పెండంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నల్లగొండ నుంచి హైదరాబాద్ సాధారణ టికెట్ ధర రూ.210 ఉంటే.. ప్రత్యేక బస్సులో రూ.280 వసూలు చేశారు. కాగా.. నల్లగొండ బస్టాండ్ సోమవారం ప్రయాణికులతో రద్దీగా మారింది. సరిపడా బస్సులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీనికి తోడు బస్ చార్జీలు అధికంగా ఉండడంతో సిబ్బందితో వాగ్వాదానికి దిగారు.

రద్దీగా మారిన బస్టాండ్.

మూడు రోజులు సెలవులు ముగియడంతో ప్రయాణికులు సొంతూళ్ల నుంచి ఆయా ప్రాంతాలకు బయల్దేరారు. దీంతో నల్లగొండ ఆర్టీసీ బస్టాండ్ సోమవారం కిక్కిరిసిపోయింది. బస్సుల కోసం ప్రయాణికులు బారులు తీరారు. బస్సు ప్లాట్‌ఫాం మీదకు వచ్చే సమయంలోనే బుస్సులోకి ఎక్కేందుకు ప్రయత్నించారు. ఇక బస్సులు ఎక్కే సమయంలో తొక్కిసలాట సైతం జరిగింది. ఆర్టీసీ అధికారులు ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు ఏర్పాటు చేయడంలో విఫలమయ్యారని.. ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



సిబ్బందితో గొడవపడుతున్న ప్రయాణికులు

చార్జీలు పెంచడం సరికాదు



ప్రయాణికుల అవసరాలను ఆసరాగా చేసుకుని టికెట్ రేటు పెంచడం సరైంది కాదు. ప్రభుత్వం అడ్డగోలు పథకాల పేరుతో డబ్బులు వృథా చేయడం మానేసి సామాన్యుల నడ్డి విరిగేలా టికెట్ ధర పెంచడం ఏంటి. బస్సులు పెంచుతున్నామని చెప్పి అదనపు బస్సుల పేరుతో అడ్డగోలుగా చార్జీలు వసూలు చేస్తున్నారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణించే సామాన్యులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది.

– మేడి యాదగిరి, ప్రయాణికుడు



నల్లగొండ బస్టాండ్‌లో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

పాత పద్ధతిలోనే టెన్త్ పరీక్షలు

- ఉత్తర్వులు జారీ చేసిన విద్యాశాఖ డైరెక్టర్
- ఉపాధ్యాయ వర్గాల్లో వీడిన ఉత్కంఠ
- రాత పరీక్షకు 80, ఇంటర్నల్‌కు 20 మార్కులు



నల్లగొండ : పదో తరగతి వార్షిక పరీక్షలు పాత పద్ధతిలోనే జరగనున్నాయి. ఇందుకు సంబంధించి పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో మాదిరిగానే రాత పరీక్ష 80 మార్కులు, ఇంటర్నల్ మార్కులు 20 చొప్పున ఉంటాయి. ఈ విధానం 2014–15 నుంచి అమల్లో ఉంది. కాగా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అధిక శాతం విద్యార్థులకు 20కి 20 ఇంటర్నల్ మార్కులు వేస్తున్నాయని, దీంతో విద్యార్థులు నష్టపోతున్నారని విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో 2025–26 విద్యా సంవత్సరం నుంచి ఇంటర్నల్ మార్కుల విధానం ఉండదని 100 మార్కులతోనే వార్షిక పరీక్షలు ఉంటాయని గత ఏడాది అక్టోబర్ 28 ప్రభుత్వం ప్రకటించింది.

ఉత్కంఠకు తెర

జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం అయ్యాయి. మూడు నెలలు కావస్తున్నా వార్షిక పరీక్షలు 100 మార్కులతో నిర్వహించాలనే దానిపై అధికారిక ప్రకటన రాకపోవడంతో విద్యార్థులను ఆ దిశగా సిద్ధం చేయడంలో ఉపాధ్యాయుల్లో సందిగ్ధం నెలకొంది. దీంతో ప్రభుత్వం నుంచి వచ్చే ప్రకటన కోసం ఉపాధ్యాయులకు ఎదురుచూపులు తప్పలేదు. ఎట్టకేలకు సోమవారం పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ పాత పద్ధతిలోనే వార్షిక పరీక్షలు నిర్వహించనున్నట్లు ఉత్తర్వులు జారీ చేయడంతో ఉత్కంఠకు తెరపడింది.

మహాశివుడికి రుద్రాభిషేకం

యాదగిరిగుట్ట: యాదగిరి క్షేత్రానికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రుద్రాభిషేకం, బిల్వార్చన, ముఖ మండపంలో స్పటికలింగానికి పూజలు నిర్వహించారు. పూజల్లో ఈఓ వెంకట్రావ్, భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ప్రధానాలయంలోనూ సంప్రదాయ పూజలు నిర్వహించారు.

గిరిజనులకు వైద్యం అందించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నాగార్జునసాగర్ : అమ్రాబాద్ అటవీ ప్రాంతంలోని చెంచుగూడేలు, తండాల్లోని గిరిజనులకు అవసరమైన వైద్య సదుపాయాలు కల్పించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. సోమవారం నందికొండ మున్సిపాలిటీ కార్యాలయంలో పలు స్వచ్ఛంద సంస్థలు, అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నిరక్షరాస్యత, అవగాహన లోపం, మేనరిక వివాహాలు, పౌష్టికాహారలోపం, యుక్తవయస్సుకు ముందే గర్భం దాల్చడం, వివిధ జబ్బులకు సకాలంలో చికిత్స తీసుకోకపోవడం, రక్తహీన తదితర కారణాలతో గిరిజనులు బాధపడుతున్నారని తెలిపారు. గిరిజనుల ఆరోగ్యానికి సంబంధించిన లోపాలను గుర్తించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 'నైస్' స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి రాఖీ నాగర్ కర్నూల్ జిల్లా అప్పాపూర్, రాంపూర్, చెంచుపేటలతో పాటు ఐదు రాష్ట్రాల్లోని గిరిజనుల ఆరోగ్యం కోసం పనిచేసిన అనుభవాలను వివరించారు.

చందంపేటను పైలట్ ప్రాజెక్టుగా తీసుకోవాలి

చందంపేట మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకుని అక్కడి సమస్యలను అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. అందుకు



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

దేవరకొండ డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ రవిని నోడల్ అధికారిగా, డీటీడీఓ చత్రునాయక్, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజకుమార్‌ను సమన్వయ సమస్యల పరిష్కారానికి అధికారులుగా నియమిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కమలానెహ్రూ ఏరియా ఆస్పత్రిని సందర్శించి.. రోగులకు అందిస్తున్న వైద్య సేవల వివరాలను డాక్టర్ మాత్రు నాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, డీఎంహెచ్ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ రవి, డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి చత్రునాయక్, రిచ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి రష్మీ, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి తదితరులు ఉన్నారు.

ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలి

నల్లగొండ టౌన్ : నులి పురుగుల నివారణ కోసం 19 సంవత్సరాలలోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి పేర్కొన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం నల్లగొండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏఎన్‌ఎం, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో వైద్యుల పర్యవేక్షణలో ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ వేణుగోపాల్, రేణుక, డీఈఓ భిక్షపతి, జిల్లా మాస్ మీడియా అధికారి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి మాత్రలు వేస్తున్న కలెక్టర్

మహిళా పోలీసులు అన్ని విధులు నిర్వర్తించాలి



మాట్లాడుతున్న ఎస్పీ శరత్ చంద్ర పవార్

నల్లగొండ : నేరాలర నియంత్రణలో భాగంగా మహిళా పోలీస్ సిబ్బంది అన్ని విధులు నిర్వర్తించడానికి సిద్ధం కావాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ సూచించారు. సోమవారం నల్లగొండలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో అన్ని ప్రాంతాల పోలీస్‌స్టేషన్లలో పనిచేస్తున్న మహిళా సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పురుష సిబ్బందితో సమానంగా విధులు నిర్వహిస్తే ఎదురయ్యే సమస్యలు, కుటుంబం తరపున వస్తున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. షీ లీడ్స్–నల్లగొండ బిలీవ్స్ అనే నినాదంతో నూతన కార్యక్రమం ఏర్పాటు చేసిన సందర్భంగా ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. మహిళా సిబ్బంది పోలీస్‌స్టేషన్ రిసెప్షన్, రికార్డు వర్క్, సీసీటీఎన్‌ఎస్, టెక్ టీమ్, కమ్యూనిటీ పోలిసింగ్ ప్రోగ్రాం, బ్లూ క్లోట్స్, నైట్ పెట్రోలింగ్, పిటిషన్ ఎంక్వయిరీ చేయాలన్నారు. కోర్ట్ సమన్స్, వెహికల్ చెకింగ్, ఎస్కార్టు, ట్రాఫిక్, బందోబస్తు, మెడికల్, కోర్టు డ్యూటీలు సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ఏఎస్పీ మౌనిక, అదనపు ఎస్పీ రమేష్, ఎస్‌బీ సీఐ రాము, డబ్ల్యూపీఎస్ సీఐ కరుణాకర్, ఆర్ఐ సంతోష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గౌరికుంటతండా జలమయం



వరద నీటిలో చిక్కుకున్న గౌరికుంటతండా



ఓ ఇంట్లోకి చేరిన వర్షపు నీరు

కొండమల్లేపల్లి : భారీ వర్షానికి నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలంలోని గౌరికుంటతండా జలమయం అయ్యింది. భారీ వర్షం వల్ల తండా పైనున్న అబ్బనబోయినగూడెం నుంచి వచ్చిన వరద అంత తండాను ముంచెత్తింది. సుమారు 15 మంది ఇళ్లలోకి నీరు చేరింది. అబ్బనబోయిన గూడెం సమీపంలో నిర్మించిన ఓ ఫంక్షన్ హాల్ ఎత్తు పెంచుకొని వరద కట్టపోయడంతో పట్టణంలోని నల్లకుంటకు వెళ్లాల్సిన వర్షపు నీరు మొత్తం కూడా తండాకు చేరింది. ఈ విషయాన్ని గ్రామస్తులు ఉన్నతాధికారులకు ఫోన్ ద్వారా తెలియజేశారు. వెంటనే అధికారులు గ్రామాన్ని సందర్శించారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి తండావాసులకు హామీ ఇచ్చారు. ఆయన వెంట తహసీల్దార్ నరేందర్, ఎస్ఐ అజ్మీర రమేష్, రెవెన్యూ సిబ్బంది తదితరులున్నారు.



తండావాసులతో మాట్లాడుతున్న ఆర్డీఓ రమణారెడ్డి, తహసీల్దార్

మదర్ డెయిరీ నిర్వీర్యానికి కుట్ర

- బీఆర్‌ఎస్ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొంగిడి మహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట: కాంగ్రెస్ ప్రభుత్వం మదర్ డెయిరీని నిర్వీర్యం చేసే కుట్ర చేస్తుందని బీఆర్‌ఎస్ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి ఆరోపించారు. యాదగిరిగుట్టలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న రైతుల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. గత ఏడాది జరిగిన మదర్ డెయిరీ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపిస్తే రూ.30 కోట్ల గ్రాంట్, రైతులకు ప్రోత్సాహక డబ్బులు విడుదల చేయిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యేలు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి విజయ డెయిరీకి రూ.100 కోట్ల గ్రాంటు ఇచ్చారని, మదర్ డెయిరీకి ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. పెండింగ్ బిల్లులు, బోనస్ తీసుకురావాల్సిన బాధ్యత మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యదేనన్నారు. ఈ నెల 20వ తేదీ వరకు పెండింగ్ పాల బిల్లులు ఇవ్వకుంటే రైతులతో కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు కస్తూరి పాండు, కందాల అలివేలు రంగారెడ్డి, మాజీ డైరెక్టర్లు దొంతిరి సోమిరెడ్డి, ఒగ్గు భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



బాధితుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ : ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సోమవారం గ్రీవెన్స్‌డే సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆమె అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌తో కలిసి బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం అధికారులతో సమావేశమయ్యారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ఫిర్యాదులపై బాధితులకు వెంటనే సమాధానం ఇవ్వాలని సూచించారు. ఏ స్థాయిలో ఆ సమస్య ఉందో ఆ అధికారికి వాటిని పంపి పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు.

పొలాలకు వెళ్లనీయడం లేదు



మా పొలాలకు వెళ్లే దారి డొంక అంతా ఇరుగ్గా ఉంది. 100 ఎకరాలకు ఆ దారి గుండా వెళ్లాలి. మా తాతల కాలం నుంచి ఉన్న ఆ డొంక మీదుగా వెళ్లకుండా ఓ రైతు అడ్డుకుంటున్నాడు. అక్కడ నుంచి వెళ్లే రైతులను బెదిరిస్తున్నాడు. ఈ విషయంలో అధికారులు తగిన చర్యలు తీసుకుని న్యాయం చేయాలి.

– రైతులు, ఎర్రబెల్లి, నిడమనూరు మండలం

కొడుకు, కోడలు పట్టించుకోవడం లేదు



నాకు ముగ్గురు సంతానం. అందులో ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. నాకు 4.24 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమిలో నా కొడుకు లింగయ్యకు 4 ఎకరాల పట్టా చేశాను. మిగిలిన 24 గుంటలు నా భార్య పేరున ఉంచాను. కొన్నాళ్ల నుంచి నా కొడుకు, కోడలు మా యోగ క్షేమాలు పట్టించుకోవడం లేదు. ఆడపిల్లలను ఇంటికి కూడా రానివ్వడం లేదు. మమ్మల్ని ఇంట్లో ఉండనీయడం లేదు. అనారోగ్యంతో బాధపడుతున్న నన్ను పట్టించుకోవడం లేదు. మిగిలిన 24 గుంటల భూమిని మనవరాలి మీద పట్టా చేయాలని ఒత్తిడి చేస్తున్నారు. నా కొడుకు, కోడలిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలి.

– యాదయ్య, భైరవునిబండ, శాలిగౌరారం మండలం

క్లుప్తంగా

మద్యానికి బానిసై వ్యక్తి మృతి

చింతపల్లి: మద్యానికి బానిసై వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన చింతపల్లి మండలం మదనాపురం గ్రామ సమీపంలో జరిగింది. సోమవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతపల్లి మండలం పాలెంతండా గ్రామానికి చెందిన సపావత్ రమేష్(40) మద్యానికి బానిసై నిత్యం తాగుతూ ఉంటాడని గ్రామస్తులు పేర్కొన్నారు. ఆదివారం రాత్రి తండాకు వచ్చే దారిలో మదనాపురం గ్రామ సమీపంలో రోడ్డు పక్కన మృతిచెంది ఉన్నట్లు పోలీసులు తెలిపారు. శరీరం డీ హైడ్రేషన్‌కు గురై మృతిచెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించి, మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం


శ్రీనయ్య

దేవరకొండ: దేవరకొండ పట్టణంలోని హనుమాన్ నగర్‌లో నివాసముంటున్న వల్లపు శ్రీనయ్య ఈ నెల 5వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. దీంతో శ్రీనయ్య కుమారులు సోమవారం దేవరకొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. శ్రీనయ్య ఇంటి నుంచి వెళ్లినప్పుడు నలుపు రంగు షర్ట్, తెల్ల లుంగి ధరించినట్లు తెలి పారు. ఆచూకీ తెలిసిన వారు 8712670154ను సంప్రదించాలని సూచించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మండలం గూడూరు గ్రామ పంచాయతీ పరిధిలో సోమవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐ మల్లికంటి లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గూడూరు గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీరామ ఫైనాన్స్ సమీపంలో గల ఖాళీ స్థలంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడు బూడిద రంగు ఆఫ్ షర్ట్, పెద్ద గల్లు గల లుంగీ ధరించి ఉన్నాడని, సుమారు 40 నుంచి 45 ఏళ్ల వయస్సు కల్గి ఉంటాడని ఎస్‌ఐ తెలిపారు. మృతుడు కొంతకాలంగా గ్రామంలో భిక్షాటన చేస్తున్నాడని స్థానికులు తెలిపినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 8712670189, 8712670151 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి


ప్రశాంత్ (ఫైల్)

నాగారం: సూర్యాపేట–జనగామ జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి మండలం తొండ గ్రామానికి చెందిన గొలుసుల నరేష్(27), గొలుసుల ప్రశాంత్ (23) వరుసకు అన్నదమ్ముళ్లు. ఇద్దరు కలిసి ఆదివారం రాత్రి పని నిమిత్తం స్వగ్రామం నుంచి బైక్‌పై సూర్యాపేటకు బయల్దేరారు. మార్గమధ్యలో నాగారం మండల పరిధిలోని ఫణిగిరి గ్రామ శివారులో సూర్యాపేట–జనగామ జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం వీరి బైక్‌ను ఢీకొట్టడంతో నరేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న ప్రశాంత్‌కు తీవ్ర గాయాలు కావడంతో సూర్యాపేటలోని ఏరియా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతులిద్దరు అవివాహితులు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్‌ఐ ఎం. ఐలయ్య తెలిపారు.

ఆశయం లేనివాడే పేదవాడు

- హైదరాబాద్‌లోని రామకృష్ణ మఠం అధ్యక్షుడు బోధమయానందజీ మహరాజ్


ఆలేరు శ్రీరామకృష్ణ విద్యాలయంలో వివేకానంద విగ్రహాన్ని ఆవిష్కరించిన స్వామి బోధమయానందజీ మహరాజ్


మాట్లాడుతున్న స్వామి బోధమయానందజీ మహరాజ్

ఆలేరు: డబ్బులేని వాడు కాదు.. జీవితంలో ఆశయం లేనివాడే పేదవాడు అని స్వామి వివేకానంద మాటలను స్ఫూర్తిగా తీసుకొని యువత ముందుకుసాగాలని హైదరాబాద్‌లోని రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానందజీ మహరాజ్ అన్నారు. సోమవారం ఆలేరు పట్టణంలోని శ్రీరామకృష్ణ విద్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన స్వామి వివేకానంద విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎవరిపైన ఆధారపడకుండా భారతదేశాన్ని ప్రపంచంలోనే బలమైన ఆర్థికశక్తిగా తీర్చిదిద్దేందుకు యువత అడుగులు వేయాలని సూచించారు. విద్యార్థి దశలోనే క్రమశిక్షణను అలవర్చుకోవడంతో జీవితం విలువ తెలుస్తుందన్నారు. సామాజిక స్పృహ, సేవాగుణం పెంపొందించుకోవడం వల్ల నాయకత్వ లక్షణాలు అబ్బుతాయన్నారు. స్వామి వివేకానంద, బుద్ధుడు, అబ్దుల్ కలాం లాంటి మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కాలక్షేపం, విలాస జీవితం, మత్తు పదార్థాల మయంగా సమాజం మారిపోవడం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చెడు ఆలోచనలు, అలవాట్లను ఆదిలోనే తుంచివేయాలని విద్యార్థులకు సూచించారు. శ్రీరామకృష్ణ విద్యాలయం ప్రధానాచార్య బండిరాజుల శంకర్ మాట్లాడుతూ.. భారత సంస్కృ, సంప్రదాయాలను ప్రపంచానికి చాటిన చెప్పిన మహనీయుడు స్వామి వివేకానంద అని అన్నారు. అనంతరం బోధమయానందజీని బండిరాజుల శంకర్ ఘనంగా సన్మానించారు. క్విజ్, వ్యాసరచన పోటీల్లో విజేతలకు స్వామిజీ బహుమతులు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్వావలంబి భారత్ అభియాన్ కన్వీనర్ జి. రమేష్, పాఠశాల కార్యదర్శి తిరుపతమ్మ, ఆలేరు ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ అధికారి దూడల వెంకటేష్, మాజీ సర్పంచ్ చింతకింది మురళి, బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి సజన్‌కుమార్ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నీరా కేంద్రాన్ని తక్షణమే ప్రారంభించాలి

- కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ రమణ



మాట్లాడుతున్న కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ రమణ

భువనగిరిటౌన్ : గీత కార్మికుల ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడానికి భువనగిరి మండలంలోని నందనం గ్రామంలో నిర్మించిన నీరా కేంద్రాన్ని తక్షణమే ప్రారంభించాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం భువనగిరిలో నిర్వహించిన కల్లుగీత సంఘం జిల్లా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న గీతకార్మికుల ఎక్స్‌గ్రేషియా డబ్బులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరారు. తమ వృత్తిలో భాగంగా మృతిచెందిన, గాయపడిన 710 మంది కల్లుగీత కార్మికులకు మంజూరైన రూ.12.60కోట్ల ఎక్స్‌గ్రేషియా డబ్బులను సంవత్సరం గడిచినా చెల్లించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొలగాని జయరాములు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో గీత కార్మికుల సంక్షేమానికి అనేక హామీలను ఇచ్చిందని, ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు గడిచినా ఇప్పటివరకు వాటిని అమలు చేయడంలేదన్నారు. గీత కార్మికులను ఎలక్షన్ సమయంలో కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా గీత కార్మికుల బతుకులు మాత్రం మారడం లేదన్నారు. గీత కార్మికులకు పెన్షన్ రూ.4000 ఇవ్వాలని, మెడికల్ బోర్డు నిబంధనను తొలగించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు నెమిలె మహేందర్, మద్దెల రాజయ్య, ధూపాటి వెంకటేష్, అంతటి అశోక్, బత్తిని భిక్షం, జిల్లా ఉపాధ్యక్షులు ఎరుకల భిక్షపతి, కోరుకొప్పుల కిష్టయ్య, జిల్లా కమిటీ సభ్యులు పాండాల మైసయ్య, మారగోని అశోక్, మారగోని శ్రీరామ్ మూర్తి, గడ్డమీది దశరథ, ఎర్ర రవీందర్, చెరుకు మల్లేశం, కొండం రఘురాములు, పాండవుల లక్ష్మణ్ ఉన్నారు.

రైతులు నష్టపోకుండా డబ్ల్యూడీఆర్‌ఏ ఏర్పాటు


చౌల్లరామారంలోని గోదాముల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఐసీఎం ప్రోగ్రాం డైరెక్టర్ శ్యామ్‌కుమార్

- ఐసీఎం ప్రోగ్రాం డైరెక్టర్ శ్యామ్‌కుమార్

అడ్డగూడూరు: రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటలను తక్కువ ధరకు అమ్మి నష్టపోతున్నారని, దీని నివారణకు భారత ప్రభుత్వం వేర్‌హౌజింగ్ డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేటరీ అథారిటీ(డబ్ల్యూడీఆర్‌ఏ) ఏర్పాటు చేసిందని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కోఆపరేటివ్ మేనేజ్‌మెంట్(ఐసీఎం) ప్రోగ్రాం డైరెక్టర్ శ్యామ్‌కుమార్ తెలిపారు. అడ్డగూడూరు మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో డబ్ల్యూడీఆర్‌ఏపై సోమవారం రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు పండించిన పంటలను అమ్ముకునే సమయంలో గిట్టుబాటు ధర లేక, నిల్వ ఉంచుకునే పరిస్థితి లేక చేసిన అప్పులు తీర్చడానికి తక్కువ ధరకు అమ్ముకుంటున్నారన్నారు. ఈ పరిస్థితిని నివారించి అధిక ధర వచ్చినప్పుడు పంటను అమ్ముకునే సౌకర్యం కల్పిస్తూ ప్రభుత్వం ఎక్కడికక్కడ వేర్‌హౌసింగ్ గోదాములను ఏర్పాటు చేసిందన్నారు. అడ్డగూడూరు మండలంలో చౌల్లరామారం గ్రామంలో గోదాములు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులు తాము పండిచిన పంటకు గిట్టుబాటు ధర వచ్చేంత వరకు ఈ గోదాముల్లో నామమాత్ర రుసుముతో పంట నిల్వ చేసుకోవచ్చని సూచించారు. నిల్వ చేసిన పంటపై 80శాతం వరకు బ్యాంకులు తక్షణ రుణ సదుపాయం కల్పిస్తాయని తెలిపారు. అనంతరం చౌల్ల రామారంలోని గోదాముల వద్దకు రైతులను తీసుకెళ్లి వాటి వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా రైతులకు శిక్షణ కిట్లు, మెటీరియల్, రూ.300 చొప్పున స్టైఫండ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసీఎం డైరెక్టర్ గణేషన్, యాదాద్రి భువనగిరి డీసీఓ శ్రీధర్, పీఏసీఎస్ చైర్మన్ కొప్పుల నిరంజన్‌రెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ రామనర్సయ్య, సీనియర్ ఇన్‌స్పెక్టర్ శ్యామ్‌కుమార్, సీఈఓ వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ చెడే చంద్రయ్య, మాజీ చైర్మన్(డైరెక్టర్) పొన్నాల వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు అశోక్‌రెడ్డి, పోగుల నర్సిరెడ్డి, వీరస్వామి, వేముల భిక్షం తదితరులు పాల్గొన్నారు.

మేకలు, గొర్రెలు అపహరించేందుకు యత్నం

హుజూర్‌నగర్: గుర్తుతెలియని వ్యక్తులు మేకలు, గొర్రెలు అపహరించేందుకు ప్రయత్నించారు. ఈ ఘటన హుజూర్‌నగర్ మండలం గోపాలపురం గ్రామంలో ఆదివారం రాత్రి జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గోపాలపురం గ్రామంలోని బూరుగడ్డ రోడ్డులో షేక్ నాగులమీరాకు చెందిన మేకలు, గొర్రెలను ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు వాహనంలో తరలించేందుకు యత్నించారు. ఈ క్రమంలో అలికిడి విని నాగుల్ మీరా కుటుంబ సభ్యులు లేచి కేకలు వేయడంతో దొంగలు జీవాలను అక్కడే వదిలిపెట్టి పరారయ్యారు. గ్రామంలో గతంలో ఓ బైక్ కూడా చోరీకి గురైందని గ్రామస్తులు తెలిపారు. రాత్రి వేళ పెట్రోలింగ్ నిర్వహించాలని గ్రామస్తులు కోరుతున్నారు. కాగా ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఏఎస్‌ఐ బలరామిరెడ్డి తెలిపారు.

నిషేధిత పొగాకు ఉత్పత్తులు స్వాధీనం


పాన్ షాపులో తనిఖీ చేస్తున్న పోలీసులు

భువనగిరిటౌన్ : భువనగిరి పట్టణంలోని పాన్ షాపులు, కిరాణా దుకాణాల్లో సోమవారం భువనగిరి పట్టణ పోలీసులు తనిఖీలు నిర్వహించి నిషేధిత పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా భువనగిరి పట్టణంలోని రామ్‌నగర్‌లో నివాసముంటున్న చిన్నం శ్రీశైలం ఇంట్లో భారీ ఎత్తున నిషేధిత పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు భువనగిరి పట్టణ ఇన్‌స్పెక్టర్ రమేష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. నిషేధిత పొగాకు ఉత్పత్తులు విక్రయించే వారి సమాచారం పోలీసులకు ఇస్తే.. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎస్‌ఐ పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో ఎస్‌ఐలు లక్ష్మీనారాయణ, లక్ష్మీనరసయ్య, నరేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభకు ఉపకారం

- 31 వరకు ఎన్‌ఎంఎంఎస్ దరఖాస్తునకు గడువు



తిరుమలగిరి (తుంగతుర్తి): ప్రతిభావంతులైన విద్యార్థులకు అండగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీమ్ (ఎన్‌ఎంఎంఎస్)ను అమలు చేస్తోంది. 2025–26 విద్యాసంవత్సరానికి గాను ఈ స్కాలర్‌షిప్ స్కీమ్ నోటిఫికేషన్ విడుదలైంది. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ నెల 31వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చు. చురుకుదనం, తెలివితేటలు, చదువుపై పట్టు ఉన్న విద్యార్థులు ఆర్థిక కారణాలతో చదువుకు దూరం కారాదన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 2008 నుంచి నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ స్కీమ్ అమలు చేస్తోంది. ప్రతి సంవత్సరం జిల్లాలో చాలా మంది విద్యార్థులు ఈ స్కీమ్ ద్వారా లబ్ధి పొందుతూ ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. గతంలో ఈ స్కీమ్‌కు ఎంపికైన విద్యార్థులకు ప్రతి సంవత్సరం రూ.6వేల చొప్పున 9, 10, ఇంటర్ మొదటి సంవత్సరం, ద్వితీయ సంవత్సరం కలిపి రూ.24 వేలను అందించేవారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఈ ప్రోత్సాహకాన్ని రెండింతలు చేసింది. ప్రతి సంవత్సరం కేటాయించే మొత్తాన్ని రూ.12వేలకు పెంచింది. అంటే 4 సంవత్సరాలకు కలిపి విద్యార్థులు రూ.48 వేలు అందుకోనున్నారు. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే విద్యార్థులకు నవంబర్‌లో అర్హత పరీక్ష నిర్వహిస్తారు.

నిబంధనలు ఇవీ..

ఈ మెరిట్ స్కాలర్‌షిప్ కోసం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు అర్హులవుతారు. 7వ తరగతిలో ఓసీ, బీసీలు 55 శాతం, ఎస్సీ, ఎస్టీలు 50 శాతం మార్కులు పొంది తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.3.50 లక్షల లోపు కలిగి ఉన్న వారు అర్హులు. పాస్‌పోర్టు సైజు ఫొటోలతో పాటు ఆధార్, ఆదాయం, కులం, నివాస ధ్రువీకరణ పత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ విద్యార్థులు రూ.50 డీడీ బ్యాంకులో తీసి డీఈఓ కార్యాలయానికి పంపాల్సి ఉంటుంది.

కోదాడ పట్టణంలో ట్రాఫిక్ జామ్

- హుజూర్‌నగర్ ఫ్లైఓవర్ వద్ద భారీగా నిలిచిపోయిన వాహనాలు
- ఇబ్బందులు పడిన వాహనదారులు


కోదాడ పట్టణంలో నిలిచిపోయిన వాహనాలు

కోదాడరూరల్: కోదాడ పట్టణ పరిధిలోని హుజూర్‌నగర్ ఫ్లైఓవర్ వద్ద సోమవారం ఉదయం భారీగా వాహనాలు నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వివరాలు.. హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై కోదాడ పరిధిలోని కొమరబండ వైజంక్షన్, కట్టకమ్ముగూడెం వద్ద రోడ్డు మరమ్మతులు చేస్తున్నారు. దీంతో ఆ రెండు చోట్ల ఉన్న క్రాసింగ్‌లను పూర్తిగా మూసివేశారు. రెండు దారులను మూసివేయడంతో ఇటు కోదాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే వాహనాలు, హైదరాబాద్ నుంచి కోదాడ పట్టణంలోకి వచ్చే వాహనాలు, ఖమ్మం వైపు నుంచి మిర్యాలగూడ వైపు వెళ్లే వాహనాలు అటువైపు నుంచి విజయవాడ ,హైదరాబాద్ వైపు వెళ్లే వాహనదారులకు హుజూర్‌నగర్ ఫ్లైఓవర్ వద్ద గల బ్రిడ్జినే ఏకైక మార్గం. దీంతో పాటు ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు కోదాడ పరిసర ప్రాంతాల నుంచి పట్టణంలోకి వచ్చేవారు, విద్యాసంస్థల వాహనాలన్నీ వచ్చిపోతుంటాయి. దీంతో హుజూర్‌నగర్ ఫ్లైఓవర్ వద్ద కోదాడ వైపుతో పాటు హుజూర్‌నగర్, హైదరాబాద్ వైపు గల సర్వీస్ రోడ్‌లో భారీగా వాహనాలు నిలిచి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న పట్టణ, ట్రాఫిక్ పోలీసులు అక్కడకు చేరుకొని దాదాపుగా గంటకు పైగా శ్రమించి వాహనాలను నెమ్మదిగా కదిలిస్తూ ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

వెంబడించి.. దొంగలను పట్టుకొని..


దొంగను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు


దొంగలను పట్టుకున్న యువకులను అభినందిస్తున్న మద్దిరాల ఎస్‌ఐ వీరన్న

- పోలీసులకు అప్పగించిన యువకులు

మద్దిరాల: మహిళ మెడలో పుస్తెలతాడు అపహరించి పారిపోతున్న ఇద్దరు అంతర్‌రాష్ట్ర దొంగలను సోమవారం మద్దిరాల మండలం పోలుమల్ల గ్రామ శివారులో యువకులు పట్టుకుని పోలీసులకు అప్పగించగా.. పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. మద్దిరాల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వికాస్‌కుమార్, శుభం కుమార్ కలిసి మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలం మాటేడు గ్రామానికి చెందిన ముత్యం ప్రేమలీల మెడలో సోమవారం పుస్తెలతాడును అపహరించి బైక్‌పై దంతాలపల్లి మీదుగా సూర్యాపేట జిల్లా మద్దిరాల వైపు రాగా.. దంతాలపల్లి పోలీసుల సమాచారం మేరకు మద్దిరాల పోలీసులు మద్దిరాల మండల కేంద్రంలోని కనకదుర్గ హోటల్ వద్ద వారిని పట్టుకునే ప్రయత్నం చేశారు. కానీ దొంగలు బైక్‌ను రోడ్డు పైనే వదిలేసి చెల్కలల్ల మీదుగా పోలుమల్ల వైపు వెళ్తుండగా.. పోలీసుల సమాచారం మేరకు రెండు గ్రామాల యువకులు దొంగలను వెంబడించి పట్టుకుని పోలీసులకు అప్పగించారు. దొంగలు ఉపయోగించిన బైక్ కూడా ఖమ్మంలో అపహరించినట్లుగా పోలీసుల విచారణలో తేలింది. దొంగలను తొర్రూర్ పోలీసులకు అప్పజెప్పినట్లు మద్దిరాల ఎస్‌ఐ ఎం. వీరన్న తెలిపారు.

యువకులను అభినందించిన ఎస్‌ఐ

దొంగలను పట్టుకున్న మద్దిరాల, పోలుమల్ల గ్రామాల యువకులను ఎస్‌ఐ ఎం. వీరన్న పోలీస్ స్టేషన్‌లో అభినందించారు.

హైవేపై గుంతలు పూడ్చి వేయించిన పోలీసులు



తుర్కపల్లి: 161–ఏఏ నంబర్ జాతీయ రహదారిపై తుర్కపల్లి మండలం జేతిరాంతండా కాలువ వద్ద ఏర్పడిన గుంతలను సోమవారం తుర్కపల్లి పోలీసులు పూడ్చి వేయించారు. తాత్కాలికంగా గుంతలను పూడ్చి వేయడంతో వాహనదారులకు ఇబ్బందులు తగ్గాయి. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ తక్యుద్దీన్, కానిస్టేబుళ్లు రవినాయక్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా జలాలు వృథాగా వదిలేస్తున్నారు

- నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య


కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య తదితరులు

నల్లగొండ: కృష్ణా జలాలను వృథాగా సముద్రంలో వదిలేస్తున్నారు తప్ప జిల్లాలోని బీడు భూములకు సాగునీరు అందించడంలో లేదని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. సోమవారం రైతులతో నల్ల గొండకు వచ్చిన ఆయన కలెక్టర్‌ను కలిసి భూములకు సాగునీరు అందించాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సాగర్ నుంచి పులిచింతల మీదుగా కృష్ణా జలాలను వృథాగా వదిలేస్తున్నారని.. నకిరేకల్, శాలిగౌరారం మండలాల్లోని పొలాలకు నీరు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. ఎస్‌ఎల్‌బీసీలో 4 మోటార్లు ఉంటే 3 మోటార్లు నడుస్తున్నాయని, మిగతా మోటారు ఎందుకు నడవడం లేదన్నారు. బ్రాహ్మణవెల్లెంల ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి లక్ష ఎకరాలకు సాగునీరు ఇస్తామని చెప్పి.. ప్రాజెక్టుకు ఒక రూపాయి కూడా కేటాయించలేదని విమర్శించారు. జిల్లాలో నీటిపారుదల మంత్రి ఉన్నా.. తాగు, సాగు నీరు సక్రమంగా అందకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా ఎస్‌ఎల్‌బీసీ 4వ మోటారు నడిపి జిల్లాలోని చెరువులు, కుంటలు నింపాలన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు దోచుకుపోవడంపైనే దృష్టి పెట్టారు తప్ప ప్రజా సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. ఆయన వెంట కొండూరు శంకర్‌గౌడ్, ప్రదీప్‌రెడ్డి, వడ్డె సైదిరెడ్డి, బైరెడ్డి కరుణాకర్‌రెడ్డి, యానాల అశోక్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి ఉన్నారు.

డిప్యూటీ తహసీల్దార్ అంత్యక్రియలు పూర్తి

భువనగిరిటౌన్: అనారోగ్యంతో మృతిచెందిన భువనగిరి భూసేకరణ విభాగంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న అంశాల శివగణేష్ అంత్యక్రియలు సోమవారం హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో పూర్తయ్యాయి. శివగణేష్ భౌతికకాయానికి రెవెన్యూ సిబ్బంది నివాళులర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కొంతకాలంగా శివగణేష్ కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. రామన్నపేట డిప్యూటీ తహసీల్దార్‌గా ఉన్న ఆయనను భువనగిరి భూసేకరణ విభాగంలోకి బదిలీ చేశారు. అప్పటి నుంచి ఆయనకు వేతనం అందడం లేదు. సాంకేతిక కారణాలు చూపుతూ వేతనం చెల్లించకుండా కొర్రీలు పెట్టారని రెవెన్యూ సిబ్బంది ఆరోపించారు. దీంతో ఆయన డబ్బులు లేక అప్పులు చేసి వైద్యం చేయించుకున్నట్లు తెలిసింది. సరైన సమయంలో వేతనం రాక మానసిక వేదనతో అనారోగ్యం పాలై మృతి చెందాడని శివగణేష్ కుటుంబ సభ్యులు ఆరోపించారు. ప్రభుత్వం శివగణేష్‌కు బకాయి పడ్డ వేతనాన్ని చెల్లించడంతో పాటు ఇతర బెనిఫిట్స్ ఇవ్వాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేశాయి. నివాళులర్పించిన వారిలో అడిషనల్ కలెక్టర్ పీ. జయశ్రీ తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు కె. గిరిధర్, సి. జగన్మోహన్ ప్రసాద్, పి. రవికుమార్, డి. భగత్, కె. వెంకట్‌రెడ్డి, మాదాసు సత్యనారాయణ, పి.జైపాల్‌రెడ్డి, సోమేశ్, సురేష్, సునీల్, శ్రీకాంత్, పి. రామారావు, రిటైర్డ్ తహసీల్దార్ జ్యోతి ఉన్నారు.

సమస్యలను గడ్కరీ దృష్టికి తీసుకెళ్తా

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు
- హైదరాబాద్‌లో వినతిపత్రం అందజేసిన ట్రిపుల్‌ఆర్ భూ నిర్వాసితులు


బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న ట్రిపుల్‌ఆర్ భూ నిర్వాసితులు

చౌటుప్పల్ : ట్రిపుల్‌ఆర్ బాధితుల సమస్యలను కేంద్ర రోడ్లు, ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ దృష్టికి తీసుకెళ్తానని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నరపరాజు రాంచందర్‌రావు తెలిపారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ గంగిడి మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో ట్రిపుల్‌ఆర్ భూ నిర్వాసితులు సోమవారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసి తమ సమస్యలను మొరపెట్టుకున్నారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. బాధితులు మాట్లాడుతూ చట్టబద్ధంగా వ్యవహరించాల్సిన ప్రభుత్వమే నిబంధనలను తుంగలో తొక్కి ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్‌ను మార్చిందన్నారు. ఓఆర్‌ఆర్ నుంచి ఆర్‌ఆర్‌ఆర్ వరకు నడుమ 40కిలోమీటర్ల దూరం ఉండాల్సి ఉన్నప్పటికీ కేవలం 28కిలోమీటర్లకే పరిమితం చేశారని వాపోయారు. కొంతమంది వ్యక్తులు, సంస్థల ప్రయోజనం కోసం ముందుగా రూపొందించిన అలైన్‌మెంట్‌ను మార్చారని ఆరోపించారు. తమకు జరుగుతున్న అన్యాయంపై మూడేళ్లుగా పోరాడుతున్నామని గుర్తుచేశారు. తమకు అధికారం వస్తే అలైన్‌మెంట్‌ను మారుస్తామని గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ముఖ్య నాయకులందరూ హామీ ఇచ్చారని తెలిపారు. ఆ పార్టీ అగ్ర నాయకురాలు ప్రియాంకగాంధీ సైతం హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. అధికారం వచ్చాక తమకు అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వకుండా మరింత అన్యాయం చేస్తున్నారని వారు ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ రైతులు, నిర్వాసితులకు అండగా ఉంటామన్నారు. ఉత్తర భాగంలోని సమస్యను మరోసారి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో జాల వెంకటేష్‌యాదవ్, నాగవెల్లి దశరథ గౌడ్ పాల్గొన్నారు.